## క్లుప్తంగా

### ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ



నందిపేట్(ఆర్మూర్): మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌కు స్థానిక నాయకులు సుధాకర్‌గౌడ్ దంపతులు శనివారం సుమారు రూ. లక్ష రూపాయల విలువగల సౌండ్‌సిస్టం, మ్యాగ్నెటిక్ గ్రీన్ బోర్డ్స్‌ను వితరణ చేశారు. గతంలో రూ.లక్ష విలువ గల సామగ్రిని పాఠశాలకు అందజేస్తానని హామీ మేరకు సౌండ్ సిస్టం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మంజుల, అధ్యాపక బందం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### ఆర్థిక సహాయం అందజేత



వేల్పూర్: వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన అద్దెబస్సు డ్రైవర్ సాజిద్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఆర్మూర్ డిపో అద్దెబస్సుల డ్రైవర్స్ యూనియన్ తరఫున రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబీకులకు శనివారం అందజేశారు.యూనియన్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్, అమృత్, నాని, రమణయ్య పాల్గొన్నారు.

### ఏఐయూకేఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



కమ్మర్‌పల్లి: అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) కమ్మర్‌పల్లి ఏరియా అధ్యక్షుడిగా వి.బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా టి.బాలకిషన్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా అశోక్, గంగాధర్, కోశాధికారిగా పెద్ది రాజేశ్వర్, సభ్యులుగా ముత్తెన్న, బాలయ్య, గంగారాం, పద్మలను ఎన్నుకున్నారు.

### ఉపాధ్యాయుల దాతృత్వం



రెంజల్(బోధన్): రెంజల్ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు దాతృత్వం చాటుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. సుమారు రూ. లక్షా 10 వేలు ఉపాధ్యాయులే విరాళంగా పోగు చేసి విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను పరిష్కరించారు. గతంలో అందించిన 200 డెస్కులతో పాటు కిటికీలు, దర్వాజలు, తాగు నీటి పైపులైన్ మరమ్మతులు చేయించారు. చేయూతను అందించిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ ఫిరోజ్‌హైదర్ అభినందించారు.

### బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల నియామకం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని బీజేపీ శక్తి కేంద్రాలకు పోల్కం నవీన్, చింత మణికంఠ ఇన్‌చార్జిలుగా నియమితులయ్యారు. శనివారం ఈమేరకు పార్టీ మండలాధ్యక్షుడు బద్దం రమేశ్ రెడ్డి నియామకపు పత్రాలు అందజేశారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సున్నం మోహన్, బీజేవైఎం మండలాధ్యక్షుడు కొత్తపల్లి గణేష్, నాయకులు రెంజెర్ల గంగాధర్, చింత ప్రవీణ్, నూకల మల్లేష్ యాదవ్, కొత్తపల్లి లక్ష్మీనర్సయ్య, శ్రీరాముల శ్రావణ్, చింత హనుమంతు, గాండ్ల శ్రీనివాస్, శేఖర్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, మహర్షి తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి వివేక్‌ను కలిసిన గంట సదానందం



ఆర్మూర్ టౌన్: రాష్ట్ర గనుల, కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గంట సదానందం శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వివేక వెంకటస్వామికి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి తండ్రితో పని చేసిన సందర్భాలను గుర్తుచేశారు.

# వరినాట్లలో పశ్చిమ బెంగాల్ కూలీలు

- పదేళ్ల నుంచి నవీపేటకు వలస
- ఎకరానికి రూ.3700 కూలి



నారు మోస్తున్న పశ్చిమ బెంగాల్ కూలీ



నవీపేట శివారులో నాట్లు వేస్తున్న పశ్చిమ బెంగాల్ కూలీలు

నవీపేట: ఖరీఫ్, రబీ పంటల సాగులో భాగంగా వరినాట్లు వేసే సమయంలో పశ్చిమబెంగాల్ నుంచి నవీపేటకు గత పదేళ్ల నుంచి 40 మందితో కూడిన బృందం వలస వస్తోంది. వలస వచ్చిన కూలీలు ఎకరానికి రూ. 3700ల చొప్పున మాట్లాడుకుని నవీపేటతో పాటు చుట్టూ పక్కల గ్రామాలలో నాట్లు వేస్తున్నారు. 15 మంది బృందం గల కూలీలు రోజుకు ఆరు నుంచి ఏడెకరాల వరకు నాట్లు వేస్తారు. నారు(పుటం) మోసుకోవడంతో పాటు అన్ని పనులను వారే చూసుకుంటారు. తాడుతో గ్రామీణ టెక్నాలజీని వాడుకుని చకా చకా నాట్లు వేస్తారు. 40 నుంచి 45 రోజుల వరకు తాత్కాలిక షెడ్డులో తలదాచుకుని పనులను పూర్తి చేస్తారు. ఒక్కో కూలీ ఈ 45 రోజులలో రూ. 50 వేల నుంచి రూ. 60 వేల వరకు సంపాదిస్తారు.

### అక్కడ పనులు లేవు



పశ్చిమ బెంగాల్ ప్రాంతంలో సరైన పనులు లేవు. అక్కడ కూడా రోజువారీ కూలీగా పని చేస్తాం. కానీ పొట్ట బట్టకే సరిపోతుంది. ఆశించిన స్థాయిలో కూలీ దొరకదు. ఇక్కడ కూలీ ధర బాగుంది.

– గోపాల్, వలసకూలీ, పశ్చిమ బెంగాల్

### సీజన్ కోసం ఎదురు చూస్తాం



పశ్చిమబెంగాల్‌లో వ్యవసాయకూలీ పనులు చేస్తాను. ఇక్కడ వరినాట్లు వేసేందుకు కూలీల కొరత ఉండడంతో మాకు గిరాకీ పెరిగింది. సీజన్ ప్రారంభం కాగానే ఎప్పుడెప్పుడు రావాలని ఉంటుంది. అనుకున్న విధంగా డబ్బులు సంపాదించుకొని సంతోషంగా తిరిగి వెళ్తాం.

– కుతిరామ్, వలస కూలీ, పశ్చిమ బెంగాల్

## మిగులు జలాల వినియోగం కోసం వరదకాలువ



వరద కాలువ హెడ్ రెగ్యులేటర్..



పీవీ నరసింహారావు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

- నాటి ప్రధాని పీవీ చేత శంకుస్థాపన
- రేపటికి 32 ఏళ్లు పూర్తి
- 2010 నుంచి నీటి విడుదల..
- పునరుజ్జీవనంతో కాలువకు పెరిగిన ప్రాధాన్యత

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవడానికి ముప్కాల్ మండల కేంద్రం శివారులో 1993 జూన్ 30న నాటి ప్రధాని పీవీ నరసింహారావు శంకుస్థాపన చేశారు. ఈకాలువ నిర్మించి సోమవారంతో 32 ఏళ్లు పూర్తవుతాయి. దీంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2 లక్షల 20వేల ఎకరాల మెట్ట భూములకు నీరందించేందు రూపకల్పన చేశారు. ఇంత వరకు పనులు కొనసాగుతునే ఉన్నాయి. ప్రాజెక్టులో సముద్రమట్టం 1070 అడుగుల వద్ద ఆరు గేట్లతో హెడ్‌రెగ్యులేటర్ నిర్మించారు. 22 వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో నిర్మాణం జరిగింది. వరద కాలువ ద్వారా 2010 లో ట్రయల్ రన్ చేపట్టారు. అప్పటి నుంచి 2015లో మినహా నిరంతరం నీటి సరఫరా చేపడుతున్నారు. వరద కాలువ ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకానికి ఆధారమైంది. దీంతో వరద కాలువకు ప్రాధాన్యత పెరిగింది. వరద కాలువ పునరుజ్జీవనంతో దిగువ నుంచి ఎస్సారెస్పీకి రివర్స్ పంపింగ్ చేపట్టడానికి ఉపయోగపడుతుంది. ఎల్‌ఎండీ నింపుటకు కూడా ప్రధాన కాలువగా మారింది.

## ఇస్కాన్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి
- ఆర్మూర్‌లో వైభవంగా జగన్నాథ రథయాత్ర





మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): దేశంతో పాటు ఇతర దేశాల్లో ఇస్కాన్ చేపడుతున్న సేవలు అభినందనీయమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో శనివారం జగన్నాథ రథయాత్రను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతి స్థాపనకు భగవద్గీతలో శ్రీ కృష్ణుడు చెప్పిన విధంగా ధర్మబద్ధంగా జీవించాలన్నారు. అలాగే సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలన్నారు. అనంతరం యాత్ర పెర్కిట్ నుంచి మామిడిపల్లి చౌరస్తా మీదుగా ఆర్మూర్ పట్టణంలోని బాలాజీ ఫంక్షన్‌హాల్‌కు చేరుకుంది. శ్రీకృష్ణుడి నామస్మరణతో జగన్నాథ రథయాత్ర మారుమోగింది. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు లోకభూపతి రెడ్డి, ఈఆర్‌ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఈరవత్రి రాజశేఖర్, ఖాందేశ్ ప్రశాంత్, గుజరాతి నివేదన్ తదితరులు పాల్గొన్నారు.

**వేంకటేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పూజలు**

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నికాల్‌పూర్ గ్రామంలో మండల పూజ కార్యక్రమం సందర్భంగా వేంకటేశ్వర ఆలయాన్ని ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించి గ్రామస్తులతో మాట్లాడారు. ఆలయ పునఃనిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గుడి చుట్టూ ప్రహరీ, మినీ కల్యాణ మండపం నిర్మాణం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బీజేపీ మండల అధ్యక్షులు గడ్డం చిన్నారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తిరుపతి రెడ్డి, రావుల సుభాష్, భీమ్ నాయక్ ఉన్నారు.

### బోధన్‌లో వైభవంగా జగన్నాథుడి రథయాత్ర



రథంపై జగన్నాథుడు, బలరాముడు, సుభద్రల ఉత్సవ విగ్రహాలు

బోధన్: హరే కృష్ణ సేవా సమాజ్ బోధన్ శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పట్టణ కేంద్రంలోని నిర్వహించిన శ్రీ జగన్నాథుడి రథయాత్ర వైభవంగా జరిగింది. తొలిసారి బోధన్‌లో జగన్నాథుడి రథయాత్ర నిర్వహించడం ప్రజలు ఆసక్తిగా తిలకించారు. స్థానిక అనిల్ టాకీస్ సమీపంలోని హనుమాన్ టేకిడి కాలనీ హనుమాన్ మందిరం నుంచి రథయాత్ర ప్రారంభించారు. రథంపై జగన్నాథుడు,బలరాముడు,సుభద్రల విగ్రహాలను ప్రత్యేక పూజలనంతరం ప్రతిష్ఠించారు. రథం అక్కడి నుంచి ఆర్టీసీ కొత్తబస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు కొనసాగింది. జగన్నాథుని నామాన్ని స్మరిస్తూ భక్తజనం పరవశించారు. రథం ముందు మహిళలు భక్తిగేయాలు ఆలపిస్తూ, కోలాట నృత్యాలు చేశారు. రథయాత్రలో హరే కృష సేవా సమాజ్ ప్రతినిధులు గౌరు గోపాల్ దాస్, శ్రీనందన్ ప్రభుజీ,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రవీంద్రయాదవ్, విఠల్ ప్రభుజీ ,సచిన్, రాము , స్వప్నిల్,భీంసింగ్, పూర్ణచంద్రరావు, మనీష్, రాహుల్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



వర్ని: మండలంలోని జాకోరా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఎండుగుల దత్తు ఇటీవల మరణించారు. శనివారం మృతుని భార్య లక్ష్మికి రూ.2 లక్షల విలువైన పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును కామారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ముజీబొద్దీన్ అందజేశారు. బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, వర్ని మాజీ కోఆప్షన్ సభ్యులు ఏజాజ్, నాయకులు లక్ష్మీనారాయణ, గైని లక్ష్మణ్, ఆఫీస్ ,ప్రవీణ్ యాదవ్, ఆనంద్‌గౌడ్, మధు, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

### పారిశుధ్య పనుల పరిశీలన



ఆర్మూర్‌టౌన్ : మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఇంటి పరిసరాల్లో చెత్తను వేయవద్దని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 25వ, 36వ వార్డులలో 100 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యాక్రమంలో భాగంగా 25వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యాక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమాళి, వార్డు అధికారులు జయలక్ష్మీ, సింధుజ, సానిటరి జవాన్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

### రామాలయంలో పూజలు

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ శ్రీ కోదండ రామాలయంలో శనివారం గ్రామాభివృద్ధి కమిటీ, రామాలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు అర్చన, అభిషేకం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### సమ్మె నోటీసు అందజేత



ఆర్మూర్‌టౌన్/వర్ని (మోస్రా) : కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దండి వెంకట్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజుకు సమ్మె నోటీస్ అందజేశారు. అలాగే మోస్రా పీహెచ్‌సీలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాకార్యకర్తలు సూపర్‌వైజర్ సాయమ్మకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు స్వప్న మాట్లాడారు. ఈకార్యాక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా జాదవ్ కృష్ణ**



బోధన్: బోధన్ మున్సిపల్ కొత్త కమిషనర్ జాదవ్ కృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన వెంకట నారాయణ పదోన్నతిపై రంగారెడ్డి జిల్లా మెప్మా పీడీగా బదిలీపై వెళ్లారు. కొత్త కమిషనర్ ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నుంచి బదిలీ పై వచ్చారు.మున్సిపల్ అధికారులు ,ఉద్యోగులు కొత్త కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు.

**ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ**

కమ్మర్‌పల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కమ్మర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం సాయన్న తెలిపారు. పదో తరగతిలో ప్రవేశానికి బదిలీ, జనన, కులం ధ్రువపత్రాలతో పాటు, ఆధార్, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఇంటర్‌లో ప్రవేశానికి పదో తరగతి మెమో, బదిలీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు అవసరమని తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాలలో గాని,8790465456, 9515167500 నంబర్లలో సంప్రదించాలన్నారు.

**విద్యార్థులకు డిక్షనరీలు వితరణ**



వేల్పూర్: వేల్పూర్ మండలం పడగల్ హైస్కూలులో రోటరీ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో విద్యార్థులకు డిక్షనరీలు, నోట్‌బుక్‌లు శనివారం వితరణ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, కోశాధికారి నారాయణగౌడ్, ఐఎస్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మీసాల సురేష్, పుణ్యరాజ్, హెచ్‌ఎం రాంచందర్,తదితరులున్నారు.

**యంచలో జూలై 1న ఆషాఢమాస పూజలు**

నవీపేట: మండలంలోని యంచ గ్రామంలోని శ్రీ ఓం జగదాద్రి ఆలయంలో జూలై 1న ఆషాఢమాస పూజలు నిర్వహిస్తున్నట్లు శనివారం నిర్వాహకులు తెలిపారు. ఆలయ వ్యవస్థాపకులు స్వర్ణ కమల లక్ష్మి అమ్మ ఆధ్వర్యంలో పోచమ్మ పండుగను జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

**ఘనంగా పీవీ నరసింహారావు జయంతి**



ఆర్మూర్‌టౌన్/నందిపేట్ : ఆర్మూర్ మార్కెట్ యార్డులో, నందిపేట పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం పీవీ నరసింహారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన్ సాయిబాబాగౌడ్, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు పండిత్ పవన్, సత్యనారాయణ, దొండి రమణ, మూగ ప్రభాకర్, కొంతం మురళి, పూల నర్సయ్య, ఎస్‌కె బబ్లూ, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రాజ్‌కుమార్, పరిపాలన అధికారి తులసిరాం తదితరులు పాల్గొన్నారు.

### నేటి చిత్రం



**ప్రమాదకరంగా రోడ్డు పై గుంత**

రెంజల్: రెంజల్ శివారులో రోడ్డు పై గుంత ప్రమాదకరంగా మారింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎడపల్లి మండలం సాటాపూర్ గేట్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు గుంతలమయంగా మారింది. గుంతలపై సంబంధిత శాఖ అధికారులు డస్ట్ వేసి వదిలేస్తున్నారు. వర్షాకాలంలో గుంతలో నీరు నిలుస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – తిరుపతి హన్మాండ్లు (బుజ్జి), రెంజల్

**మాకు ఫొటో పంపండి**

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

## రైతుల్లో యూరియా కొరత ఆందోళన

- ముందస్తుగా నిల్వల కోసం యత్నం
- లారీల నుంచే తీసుకుంటున్న రైతులు



వెల్కటూర్‌లో లారీలో నుంచి ట్రాక్టర్‌లో యూరియా బస్తాలు నింపుకుంటున్న రైతులు

బాల్కొండ: ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు కోసం కావాల్సిన యూరియా ఎరువుల కోసం రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దీంతో రైతులు ముందస్తుగా యూరియా ఎరువులను నిల్వ చేసుకోవడం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లారీల నుంచే యూరియా బస్తాలను తీసుకెళ్తున్నారు. కనీసం గోదాంలోకి కూడా యూరియా బస్తాలు వెళ్లడం లేదు. ఒక్కో రైతు 20 యూరియా బస్తాలను తీసుకుని నిల్వ ఉంచుకుంటున్నారు. వ్యవసాయ అధికారులు యూరియా కొరత ఉండదని రైతుల్లో భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

**మక్క పంటకు ..**

ప్రస్తుతం యూరియా అవసరం మక్క పంటకు ఎక్కువగా ఉంది. సోయాకు బదులుగా ఎక్కువ మొత్తంలో మక్క పంటనే రైతులు సాగు చేశారు. గత రెండు రోజుల క్రితం వర్షం కురువడం వలన ఎక్కువ మంది రైతులు మక్క పంటకు యూరియా వేస్తున్నారు. యూరియాను మితంగా వాడాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

### యూరియా కోసం రైతుల తిప్పలు..



రెంజర్ల సొసైటీ వద్ద క్యూలో పెట్టిన చెప్పులు

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల సహకార సంఘంలోకి యూరియా లోడ్ రాగానే శనివారం రైతులు ఎగబడ్డారు. యూరియా బస్తాల కోసం చెప్పులను క్యూలో పెట్టారు. చివరికి రైతుకు రెండు యూరియా బస్తాల చొప్పున సిబ్బంది అందించారు. యూరియా సకాలంలో అందక పోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పసుపు బోర్డు ప్రారంభోత్సవానికి రైతులు తరలి రావాలి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: జిల్లా కేంద్రంలో పసుపుబోర్డు ప్రారంభోత్సవానికి రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని బీజేపీ నాయకులు అన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో బీజేపీ నాయకులు మాట్లాడారు. బీజేపీ నాయకులు జీవీ నర్సింహారెడ్డి, జెస్సు అనిల్, యామద్రిభాస్కర్, మందుల బాలు, తిరుపతి నాయక్, నర్సారెడ్డి, పాన్‌శ్రీను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**ముప్కాల్‌లో..**

బాల్కొండ: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సభకు రైతులు భారీగా తరలి రావాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం బాల్కొండ మండల కేంద్రంలో రైతులతో ఆయన మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు అంబటి నవీన్, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు అరెపల్లి నర్సయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రత్యేక రుణాలు



మాట్లాడుతున్న ఏపీఎం గంగాధర్

కమ్మర్‌పల్లి: ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రత్యేకంగా ఐకేపీ నుంచి రుణాలు ఇచ్చే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని కమ్మర్‌పల్లి ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని గ్రామా సమాఖ్య ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు.నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇల్లు మంజూరైన మహిళా సంఘ సభ్యురాలికి రూ. 50 వేల నుంచి లక్ష వరకు ప్రత్యేక రుణం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. బ్యాంకు లింకేజీ, సామాజిక పెట్టుబడి నిధి, స్త్రీనిధి కింద లభ్యతను బట్టి రుణం అందజేయడం జరుగుతుందని అన్నారు.మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కమల, కార్యదర్శి వాసవి, కోశాధికారి రోజారాణి, సీసీలు వర్ధం శ్రీనివాస్, నవీన్ కుమార్, భాగ్యలక్ష్మి, పీరియ, ధనలక్ష్మి, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాఠశాల నిర్వహణపై సమీక్ష



బోధన్: పట్టణ కేంద్రంలోని రాకాసీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బోధన్ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలు, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లతో శనివారం పాఠశాల నిర్వహణ అంశంపై ఎంఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం 11గంటల వరకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వివరాలు నమోదు చేయాలని సూచించారు. రెండో తరగతి నుంచి 9వ తరగతి వరకు బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించి వివరాలు రిజిస్టర్స్‌లో నమోదు చేయాలన్నారు.